క్లుప్తంగా

ఈవీఎంలపై అవగాహన



రాంసాగర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొమురవెల్లి(సిద్దిపేట): ఓటు హక్కు కలిగిన ప్రతీ ఒక్కరు ఈవీఎంలపై అవగాహన కలిగి ఉండాలని జనగామ నాయబ్ తహసీల్దార్ దయానంద్ అన్నారు. గురువారం మండలంలోని రాంసాగర్ గ్రామంలో సర్పంచ్ తాడూరి రవీందర్‌తో కలసి గ్రామస్తులకు, యువతీ, యువకులకు ఈవీఎంలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని, బీఎల్‌ఓలకు వివరాలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువత పాల్గొన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలో బుధవారం ఈవీఎంలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంజీవ్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ కరీం ఉన్నారు.

జిల్లా పౌరసరఫరాల అధికారిగా తనూజ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీసీఎస్‌ఓ తనూజ

సిద్దిపేటరూరల్: జిల్లా పౌరసరఫరాల అధికారిగా తనూజ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నిర్మల్ జిల్లా డీసీఎస్‌ఓగా విధులు నిర్వహించిన తనూజ బదిలీపై సిద్దిపేటకు రాగా ఇప్పటివరకు విధులు నిర్వహించిన సీహెచ్.బ్రహ్మరావు మెదక్ పౌర సరఫరాల శాఖ అధికారిగా బదిలీపై వెళ్లారు. ఈ మేరకు డీసీఎస్‌ఓ తనూజ కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

న్యాయం జరిగే వరకు పనులను అడ్డుకుంటాం



గురువన్నపేటలో చెత్త వాహనాన్ని అడ్డుకున్న కార్మికులు

కొమురవెల్లి(సిద్దిపేట): మండల కేంద్రంలో జీపీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ చేపట్టిన సమ్మె బుధవారం నాటికి 21వ రోజుకు చేరుకుంది. కార్మికులు పనిలోకి రాకపోవడంతో గ్రామాల్లో చెత్త పేరుకుపోవడంతో గ్రామ పంచాయతీ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేశారు. ఇందులో భాగంగా తాత్కలిక కూలీలతో చెత్త వాహనాల్లో చెత్త సేకరిస్తుండగా మండలంలోని గురువన్నపేట, మర్రిముచ్చాలలో జీపీ కార్మికులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాకు న్యాయం జరిగే వరకు పారిశుధ్య పనులను అడ్డుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పరశురాములు, రాజలింగం, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చెత్త ఆరుబయట వేయం
సిద్దిపేట ముదిరాజ్‌ల తీర్మానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పెద్దమ్మ తల్లి నీ మీద ఒట్టు వేసి ప్రమాణం చేస్తున్నాం. ఇప్పటి నుంచి ఇంట్లోని చెత్తను బయట వేయమని, కేవలం చెత్త బండికి మాత్రమే అందిస్తామని, సిద్దిపేట నియోజకవర్గ ముదిరాజ్‌లు తీర్మానం చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ముదిరాజ్ సంక్షేమ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ముదిరాజ్‌లు తీర్మానం చేశారు. సిద్దిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ.. స్వచ్ఛ సిద్దిపేటలో భాగంగా ప్రతి ఒక్కరూ ఇంట్లోని చెత్తను తడి, పొడి, హానికర చెత్తగా విభజించి చెత్త బండికి అందించాలన్నారు. తీర్మానం విషయం తెలుసుకున్న మంత్రి హరీశ్‌రావు స్పందించి ముదిరాజ్‌లకు అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో కొనసాగాలన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న అంజిరెడ్డి

గజ్వేల్‌రూరల్: గ్రామ దేవతల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని అక్కారం గ్రామంలో చేపడుతున్న దుర్గామాత ఆలయ నిర్మాణానికి సర్పంచ్ బాల్‌చంద్రం ఆధ్వర్యంలో బుధవారం రూ.51వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు ప్రభాకర్‌రెడ్డి, రాజు, చంద్రం, రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వదలని వాన

- మత్తడి దూకుతున్న చెరువులు
- కూలుతున్న శిథిల ఇళ్లు
- పలుచోట్ల రాకపోకలు బంద్



హుస్నాబాద్: హుస్నాబాద్-రామవరం రహదారిపై ప్రవహిస్తున్న వరదనీరు

హుస్నాబాద్: నాలుగు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు పట్టణంలోని ఎల్లమ్మ చెరువు నిండుకుండలా మారింది. బుధవారం చెరువు మత్తడి పడడంతో స్థానిక జనం ఆహ్లాదకరమైన వాతావరణంలో మత్తడి పడుతున్న ప్రవాహాన్ని చూసేందుకు తరలివచ్చారు. దీంతో హుస్నాబాద్ నుంచి రామవరం వెళ్లే రహదారిపై మత్తడి ప్రవహిస్తుండటంతో మోకాళ్ల లోతు వరకు వరదనీరు చేరుకుంది. వాహనదారులు, ప్రజలు వరద నీటి నుంచే రాకపోకలు సాగిస్తూ ఇబ్బందులు పడ్డారు.

తెగిన దేవాదుల కాల్వ

చేర్యాల(సిద్దిపేట): 20 రోజుల క్రితం కురిసిన వర్షాలకు మండల పరిధిలోని కమలాయపల్లి గ్రామ చెరువులోకి వచ్చే దేవాదుల కాల్వ గ్రామ శివారులో తెగిపోయింది. దీంతో సుమారు 30 మంది రైతులకు పంట నష్టం వాటిల్లింది. ఈ విషయాన్ని గ్రామ రైతులు, సంబంధిత శాఖ అధికారులు జిల్లా కలెక్టర్‌తో పాటు మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఆదేశాల మేరకు వచ్చిన ఐబీ అధికారులు తాత్కాలికంగా మట్టిని పోసి వదిలేశారు. 5 రోజులుగా కురుస్తున్న వర్షాలకు మళ్లీ కాల్వ తెగింది. గతంలో మాదిరిగానే నీరు రైతుల పొలాల్లోకి చేరి పంట నష్టం వాటిల్లింది. దీనిపై సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి శాశ్వత పరిష్కారం చేసి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కూలిన ఇల్లు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్ గ్రామంలో పచ్చిమడ్ల భూలక్ష్మి పెంకుటిల్లు బుధవారం ఉదయం కూలిపోయింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇల్లు కూలిపోవడంతో ఈ కుటుంబం ప్రస్తుతం తల దాచుకోవాడానికి ఇబ్బంది పడుతున్నారు. తమకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటుంది.



చిన్నకోడూర్(సిద్దిపేట): వాగు వద్ద ఏర్పాటు చేసిన భారీకేడ్లు

ఇరవై ఇళ్లకు నష్టం

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలంలో 20 ఇళ్లకు పాక్షిక నష్టం వాటిల్లింది. బుధవారం నెంటూరులో 10, వర్గల్‌లో 4, శాకారంలో 2, మీనాజీపేట, జబ్బాపూర్, చౌదరిపల్లి, శేరిపల్లిలో ఒకటి చొప్పున మొత్తం 20 ఇళ్లకు పాక్షిక నష్టం జరిగిందని తహసీల్దార్ సతీశ్‌కుమార్ తెలిపారు.

వరదతో రవాణా బంద్..

చిన్నకోడూర్(సిద్దిపేట): చిన్నకోడూరు మండల పరిధిలోని సికింద్లాపూర్ నుంచి దర్గపల్లి వెళ్లే మార్గంలో వాగు పొంగడంతో రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో బుధవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వాగువద్దకు ఎవరూ వెళ్లకుండా ఉండేందుకు భారీకేడ్లను ఏర్పాటు చేశారు.

చెరువును తలపిస్తున్న పాఠశాల ఆవరణ

కోహెడ(హుస్నాబాద్): మన ఊరు-మన బడిలో మిగిలి ఉన్న నిధులను పాఠశాల మైదానంలో మట్టి నింపేందుకు కేటాయించాలని బీజేపీ మండల



కోహెడ(హుస్నాబాద్): పాఠశాల మైదానంలో నిలిచిన వర్షం నీటిని చూపిస్తున్న వెంకటేశం



చేర్యాల(సిద్దిపేట): తెగిన కాల్వ నుంచి పొలాల్లోకి వస్తున్న నీరు

అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం అన్నారు. బుధవారం ఎన్టీఆర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల మైదానం వర్షం నీటితో చెరువును తలపిస్తోందన్నారు. మన బడి నిధులతో సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి మన బడిలో మిగిలిన నిధులను పాఠశాల అభివృద్ధికి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు

సిద్దిపేటకమాన్: స్వచ్ఛ సిద్దిపేటలో భాగంగా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు అన్నారు. నడుస్తూ చెత్త ఏరడం కార్యక్రమంలో భాగంగా బుధవారం మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులతో కలిసి పట్టణంలోని 37వ వార్డులో మున్సిపల్ మాజీ చైర్మన్ చెత్త ఏరివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు ప్రతిరోజు ఉదయం వార్డుల్లో నడుస్తూ చెత్త ఏరడం ద్వారా పట్టణం పరిశుభ్రంగా ఉంటుందన్నారు. తడి, పొడి, హానికర చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనానికి ఇవ్వాలని సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో వినియోగంలో లేని వస్తువుల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, కౌన్సిలర్లు బాల్‌లక్ష్మిఆనంద్, ధర్మవరం బ్రహ్మం, వంగ రేణుకాతిరుమల్‌రెడ్డి, గ్యాదరి రవీందర్, గుడాల సంధ్యశ్రీకాంత్, బందారం రాజుశ్రీలత, భూంపల్లి శ్రీలతశ్రీహరి, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



మొక్కలు నాటుతున్న ప్రతినిధులు

కోహెడ(హుస్నాబాద్): కోహెడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ రక్షణ కోసం మరులైన జవాన్లను స్మరించుకున్నారు. కోహెడ ఎన్టీఆర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో క్లబ్ ప్రతినిధులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో పొన్నాల లక్ష్మయ్య, జగన్‌రెడ్డి, నీల రవీందర్, బద్దం తిరుపతిరెడ్డి, ఖమ్మం వెంకటేశం, సంతోష్‌రెడ్డి, సుధాకర్‌రావు, సురేందర్‌రెడ్డి, నాగరాజు, కనకయ్య, రాజయ్య, రాజు, లింగయ్య పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే

హుస్నాబాద్: రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ బుధవారం హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఉధృతంగా ప్రవహించే చెరువులు, వాగుల వద్దకు వెళ్లొద్దని, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. శిథిలావస్థ గృహాల్లో ఉంటున్న వారు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్పా ప్రజలు బయటకు వెళ్లొద్దని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ సూచించారు.

నియామకం

వర్గల్(గజ్వేల్): విద్యాశాఖ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గంలో వర్గల్‌కు ప్రాధాన్యత లభించింది. బుధవారం జిల్లా కార్యవర్గాన్ని నియమించారు. ప్రధాన కార్యదర్శిగా వర్గల్ మండల వనరుల కేంద్రం ఎంఐఎస్ కోఆర్డినేటర్ నవీన్‌కుమార్‌కు చోటు దక్కింది. మహిళా అధ్యక్షురాలిగా వర్గల్ కేజీబీవీకి చెందిన ఎల్ వరలక్ష్మి, కోశాధికారిగా ఎంఆర్‌సీలో పనిచేసే కరుణాకర్‌కు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీకి నవీన్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

యువత చేతుల్లోనే దేశ భవిత

ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. బుధవారం దుబ్బాక పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో డ్రైవింగ్ లైసెన్స్‌లకు దరఖాస్తులు చేసుకున్న 300 మంది యువతీ, యువకులకు లెర్నింగ్ లైసెన్స్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక నియోజకవర్గంలో 12,689ల మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. దరఖాస్తులు చేసుకున్న వారందరికీ విడతల వారీగా స్లాట్ బుక్ చేసి లైసెన్స్‌లు ఇప్పిస్తామన్నారు. యువత, విద్యార్థుల బలంతోనే దుబ్బాక ఉప ఎన్నికల్లో విజయం సాధించానన్నారు. యువతకు ఉపాధి కల్పించేందుకు అన్ని



యువతీ, యువకులకు లెర్నింగ్ లైసెన్స్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

విధాలుగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుంకోజి ప్రవీణ్, భాస్కర్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలోని పలు బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు.

జీఓ 81ని రద్దు చేయాలి

మిరుదొడ్డి(దుబ్బాక): అసలుదారు వీఆర్‌ఏలకు ఉద్యోగ అవకాశం కల్పిస్తూ, వంతుల వారీగా విధులు నిర్వహించే వీఆర్‌ఏల భవిష్యత్‌కు గొడ్డలి పెట్టులా మారిన జీఓ 81ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం వారు మిరుదొడ్డిలో రాస్తారోకో చేపట్టారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా రోడ్డుపై బైటాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. వీఆర్‌ఏలు చేపట్టిన ఆందోళనకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మద్దెల రాజేశం, సీసీసీ జిల్లా కన్వీనర్ సూకూరి ప్రవీణ్ మద్దతు తెలిపారు. విషయం తెలుసుకున్న మిరుదొడ్డి పోలీసులు ఆందోళన వద్దకు చేరుకొని వీఆర్‌ఏలకు నచ్చజెప్పే క్రమంలో కొద్దిసేపు



పోలీసులతో వాగ్వాదానికి దిగిన వీఆర్‌ఏలు

వాగ్వాదం చోటు చేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 81ని రద్దు చేసేవరకు ఐక్య ఉద్యమాలు చేస్తామని వీఆర్‌ఏలు స్పష్టం చేశారు. సుమారు గంటపాటు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి వాటిని రక్షించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని 6, 7వ వార్డుల్లో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పట్టణంలోని ఎల్లమ్మ చెరువు మత్తడి వద్ద కొత్తగా నిర్మిస్తున్న ఎఫ్ఎస్‌టీపీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ.. రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలను పశువులు, మేకల నుంచి కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అనిత, మున్సిపల్ కమిషనర్ ఎం.ఆర్ రాజశేఖర్, కౌన్సిలర్లు లావణ్య, పద్మ, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న రజిత తదితరులు

మట్టిరోడ్డుతో తప్పని తిప్పలు

దుబ్బాక: దుబ్బాక నుంచి లచ్చపేట ప్రధాన మార్గంలో సుమారు రూ.1.25కోట్ల వ్యయంతో అధికారులు నూతనంగా బ్రిడ్జిని నిర్మించారు. బిడ్జి నిర్మాణం పూర్తయి సంవత్సరం గడుస్తున్నా కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో వర్షానికి మట్టి రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు ఆటో దిగి నడుచుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు ఎన్నిసార్లు విన్నవించుకున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వాహనదారులు,పట్టణ ప్రజలు మండిపడుతున్నారు.



బురదమయంగా మారిన రోడ్డు

పంచాయతీ కార్మికుల భిక్షాటన

రాయపోలు(దుబ్బాక): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు బుధవారం భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. దౌల్తాబాద్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్మికులు మండల కేంద్రంలో భిక్షాటన చేశారు. పలు వ్యాపార దుకాణాల్లో భిక్షాటన చేసి ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని వాపోయారు.

తొగుట(దుబ్బాక): జీపీ కార్మికులు చేపట్టిన నిరసన దీక్ష బుధవారం 21వ రోజుకు చేరింది. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీవో కార్యాలయం ఎదుట మెడకు తాడు బిగించుకొని నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్మికులు పాల్గొన్నారు.



దౌల్తాబాద్‌లో భిక్షాటన చేస్తున్న కార్మికులు

జాగృతి సేవలు అభినందనీయం



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న రవీందర్

కొండపాక(గజ్వేల్): గ్రామాభివృద్ధి కోసం అసోసియేషన్లు ముందుకు రావడం గొప్ప విషయమని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ పేర్కొన్నారు. కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని మండల పరిధిలోని దుద్దెడలోని జాగృతి ఫ్రెండ్స్ అసోసియేషన్ 24వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాసరలోని ట్రిపుల్ ఐటీలో సీటు దక్కించుకున్న విద్యార్థులు వైద్యుల పవన్ కల్యాణ్, మైలారం అజయ్‌కుమార్‌లకు ప్రోత్సాహక బహుమతులుగా 20 గ్రాముల వెండి పథకాన్ని అందజేశారు. దీంతో పాటు ఉపసర్పంచ్ గుండెల్లి ఆంజనేయులు ఇద్దరు విద్యార్థుల్లో ఒక్కొక్కరికీ రూ.2వేల చొప్పున ప్రోత్సాహకాలు అందజేశారు. కార్గిల్ అమర వీరులకు కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్, ఎంపీటీసీ బాలాజీ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు అనంతుల నరేందర్, బాకి చంద్రభాను, వడ్లకొండ శ్రీనివాస్, పెద్ది శ్రీనివాస్, నరహరి, నాగరాజు, హరీశ్ పాల్గొన్నారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి



రుణ సహాయాన్ని అందజేస్తున్న మేనేజర్ రాజేశ్‌కుమార్

కొండపాక(గజ్వేల్): స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రభుత్వం చేయూతనందిస్తోందని ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్‌కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మర్పడ్గలోని 10 స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం రూ.2కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేయడంతో బుధవారం అందజేశారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తూ ప్రభుత్వ రాయితీలను పొందుతూ బ్యాంకుల మనుగడకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో డీజీఎం కుమార్, రీజినల్ మేనేజర్ అరుణ్ జ్యోతి, చీఫ్ మేనేజర్ రేణుక, ఏపీఎం శ్రీనివాస్, సీసీ అశోక్, వీఓఏ భాగ్య, శ్రీ గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటులో అవకతవకలు

హుస్నాబాద్: ఉపాధ్యాయుల సర్దుబాటులో అవకతవకలు జరిగాయని, దీనికి జిల్లా, మండల విద్యాధికారులు చేతివాటం ప్రదర్శించారని డీటీఎఫ్(డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్) రాష్ట్ర కౌన్సిలర్ వి. వెంకటరమణారెడ్డి ఒక ప్రకటనలో ఆరోపించాడు. పాఠశాల విద్యార్థులకు నష్టం జరగకుండా ఉండాలనే ఉద్దేశంతో హేతుబద్ధీకరణ నిబంధనలు పాటించి ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేస్తే ఇదే అదనుగా భావించి విద్యాధికారులు ఇష్టానురీతిలో సర్దుబాటు చేశారన్నారు. అక్కన్నపేట, హుస్నాబాద్, కోహెడ మండలాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను అదే పాఠశాలలో అవసరమున్నా, పక్కనే ఉన్న పాఠశాలలకు ప్రతినియుక్తం చేయకుండా వేరే మండలాలకు సర్దుబాటు పేరుతో ఉత్తర్వులు ఇచ్చారన్నారు. వెంటనే జాబితాను బహిర్గతం చేసి నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశాడు. లేకుంటే న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించాడు. కార్యక్రమంలో సంఘం వివిధ మండలాల బాధ్యులు సంపత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఈర్యా నాయక్, రవీందర్‌రెడ్డి, సత్యం, తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆపదలో అండగా..

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్‌కు చెందిన రషీద్ భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న రషీద్ పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు బుధవారం రషీద్ కుటుంబాన్ని పరామర్శించి, రూ.25వేల నగదుతో పాటు నిత్యావసర సరుకులను అందించి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో సత్యం, రమేశ్, చంద్రశేఖర్, కృష్ణమూర్తి, రాజిరెడ్డి, వెంకట్‌రెడ్డి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఆర్థికసాయం

మర్కూక్(గజ్వేల్): మండలంలోని ఎర్రవల్లి గ్రామానికి చెందిన మొండి సాయిలు కుమారుడు సంపత్(23) హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదానికి గురికాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి బుధవారం చికిత్స నిమిత్తం తమవంతుగా రూ.10వేలు అందించారు. అదేవిధంగా ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మరాంచంద్రం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, సర్పంచ్ భాగ్యభిక్షపతి కలిసి రూ.18వేలు ఆర్థికసాయం అందించారు.

◆ సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని అలిరాజ్‌పేట, నిర్మల్‌నగర్ గ్రామాల రైతులకు పీఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఏకలవ్య ఫౌండేషన్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి సేంద్రియ వ్యవసాయం, సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న కాలనుగుణంగా రైతులు వ్యవసాయంలో సాగు పద్ధతులను మార్చుకోవాలని సూచించారు. రైతుల ఆర్థికాభివృద్ధికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరికరాలు, రుణాలు, ఎరువులు, మందులు అందిస్తున్నామని తెలిపారు. అనంతరం పేద కుటుంబానికి, పది ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు హస్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అంథోని నగదు అందించారు.

◆ దళిత అధికారిపై కక్ష సాధింపు చర్యలు సరికాదు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దళిత అధికారిపై తొగుట మండలం చందాపూర్ సర్పంచ్ బొడ్డు నర్సింలు కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని దళిత, ప్రజా సంఘాల నాయకుడు పరశురాములు అన్నారు. బుధవారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో పరశురాములు మాట్లాడుతూ.. సర్పంచ్ తొగుట మండల ఏపీఓ కిషన్‌ను కులం పేరుతో దూషించాడని, ఎంపీడీఓ కార్ డ్రైవర్ అంటూ దూషించాడని వెంటనే చందాపూర్ సర్పంచ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. చందాపూర్ సర్పంచ్ నర్సింలు వెంటనే దళిత అధికారి కిషన్‌కు క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో దళిత ఐక్య సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ, ఎమ్మార్పీఎస్, మాల మహానాడు, దళిత బహుజన ఫ్రంట్, డీఎస్పీ తదితర సంఘాల నాయకులు ఉమేశ్, శ్రీకాంత్, ఎల్లేశ్, ఆనందర్, శేఖర్, మధు పాల్గొన్నారు.

◆ ఈజీఎస్ ఉద్యోగులకు పేస్కేల్ అందించాలి

సిద్దిపేటజోన్: సీఎం కేసీఆర్ అసెంబ్లీలో కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తానని హామీ ఇచ్చాడని, ఒకే శాఖ పరిధిలో పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగుల మాదిరిగా ఈజీఎస్ కాంట్రాక్ట్ ఉద్యోగులను కూడా క్రమబద్ధీకరించి, పేస్కేల్ ఇవ్వాలని కోరుతూ ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ మల్లారెడ్డి, నాయకులు మారోద్దిన్, పద్మ, కరుణాకర్‌రెడ్డి, శివకుమార్, రాజు పాల్గొన్నారు.

◆ 'మణిపూర్ దుండగులను ఉరితీయాలి'

అక్కన్నపేట(హుస్నాబాద్): మణిపూర్‌లో గిరిజన మహిళలపై జరిగిన అమానవీయ ఘటనలోని దుండగులను వెంటనే ఉరితీయాలని తెలంగాణ దళిత సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ బత్తుల చంద్రమౌళి డిమాండ్ చేశారు. బుధవారం అక్కన్నపేట మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో దళిత సంఘాల ఆధ్వర్యంలో ఘటనను నిరసిస్తూ ఆందోళన చేశారు. కార్యక్రమంలో నాయకులు గంగారపు అనిల్, మహ్మద్ అక్బర్, మిట్టపల్లి సదయ్య, గుండేటి సారయ్య, బండి ఎల్లయ్య పాల్గొన్నారు.

◆ ప్రధాని మోదీ రాజీనామా చేయాలి

చేర్యాల(సిద్దిపేట): మణిపూర్ ఘటనకు బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ డిమాండ్ చేశాడు. బుధవారం మణిపూర్ ఘటనను నిరసిస్తూ పట్టణ కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో ప్రధాని దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. మణిపూర్‌లో జరిగిన హింసకు ఆ రాష్ట్ర సీఎం బీరేణ్ సింగ్, ప్రధాని కారణమన్నారు. సభ్య సమాజం తలదించుకునేలా ఇలాంటి హింసాత్మక ఘటనలు మహిళలపై జరగడం సిగ్గుచేటన్నారు. ఈ ఘటనకు పాల్పడిన నిందితులకు ఉరి శిక్ష వేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూమయ్య, భాస్కర్ రెడ్డి, సుదర్శన్, మల్లయ్య పాల్గొన్నారు.